పదే పదే అంబేద్కర్ అనడం ఫ్యాషనైపోయింది

- దేవుడ్ని ఇన్నిసార్లు స్మరిస్తే స్వర్గానికైనా వెళ్లొచ్చు
- రాజ్యసభలో అమిత్‌షా వివాదాస్పద వ్యాఖ్యలు
- రాజకీయ దుమారం.. షాపై విరుచుకుపడ్డ విపక్షం
- క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్
- నష్టనివారణ చర్యలకు దిగిన ప్రధాని మోదీ
- అంబేద్కర్‌ను గౌరవిస్తున్నది తామేనని వెల్లడి
- తన వ్యాఖ్యలను వక్రీకరించారన్న అమిత్ షా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన పేరును పదే పదే ఉచ్చరించడం ఇప్పుడు ఓ ఫ్యాషన్‌గా మారిందంటూ అభ్యంతరకరంగా మాట్లాడారు. అంబేద్కర్‌ను కాదు ఆయనకు బదులుగా దేవుడిని స్మరిస్తే, స్వర్గానికైనా వెళ్లొచ్చంటూ ఉచిత సలహానిచ్చారు. అమిత్ షా వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. అంబేద్కర్‌ను అవమానించిన షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. అమిత్ షాపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చింది.

అసలేం జరిగింది? షా ఏమన్నారు??

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా మంగళవారం రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ జరిగింది. ఈ క్రమంలో హోంమంత్రి అమిత్‌షా మాట్లాడుతూ అంబేద్కర్‌ను ఉద్దేశిస్తూ పలు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. 'అబీ ఏక్ ఫ్యాషన్ హో గయా హై – అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్. ఇత్నా నామ్ అగర్ భగవాన్ కా లేతే తో సాత్ జన్మన్ తక్ స్వర్గ్ మిల్ జాతా (అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అంటూ పదే పదే అనడం ఇప్పుడు ఓ ఫ్యాషన్‌గా మారింది. దీనికి బదులుగా దేవుడిని ఇన్నిసార్లు స్మరిస్తే.. స్వర్గానికి వెళ్లొచ్చు)' అని అన్నారు. ఈ వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. షా వ్యాఖ్యలను విపక్ష నేతలు సహా నెటిజన్లు కూడా ఖండించారు.

అట్టుడికిన పార్లమెంట్

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా వెంటనే క్షమాపణలు చెప్పాలని విపక్షాలు బుధవారం పెద్దయెత్తున నిరసనలు, నినాదాలు చేశాయి. దీంతో రాజ్యసభ అట్టుడికిపోయింది. ఈ క్రమంలో సభ గురువారానికి వాయిదా పడింది. అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించబోదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. మనుస్మృతిని అనుసరించే వారికి కచ్చితంగా అంబేద్కర్‌తో చిక్కేనన్న ఆయన షా వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇండియా కూటమి సభ్యులతో కలిసి పార్లమెంట్ ఆవరణలో అంబేద్కర్ ఫొటోలతో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మూడు రంగుల జెండా, అశోక చక్రానికి బీజేపీ, ఆరెస్సెస్ వ్యతిరేకమన్న విషయాన్ని షా వ్యాఖ్యలు ధ్రువపరుస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. షాను మంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు. బీజేపీ మిత్రపక్షాలు షా వ్యాఖ్యలతో ఏకీభవిస్తాయా? అని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ప్రశ్నించారు. అంబేద్కర్ పేరును బీజేపీ, కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకొంటున్నాయని బీఎస్పీ అధినేత్రి మాయావతి ధ్వజమెత్తారు. మహాత్మాగాంధీ, నెహ్రూ తర్వాత ఇప్పుడు అంబేద్కర్‌ను బీజేపీ అవమానిస్తున్నదని ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ మండిపడ్డారు.

అమిత్ షా వ్యాఖ్యలపై పార్లమెంట్ వద్ద నిరసనకు దిగిన విపక్ష ఎంపీలు

షాపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

అమిత్ షా వ్యాఖ్యలపై టీఎంసీ రాజ్యసభ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చారు. అంబేద్కర్ మార్గదర్శకత్వంలో నడిచే లక్షలాది మందికి షా వ్యాఖ్యలు అవమానకరమని బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. ఈ వ్యాఖ్యలతో బీజేపీ ముసుగు తొలిగిపోయిందన్నారు. అంబేద్కర్ దేవుడికంటే ఎంతమాత్రం తక్కువకాదని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అన్నారు. పార్టీ నేతలతో కలిసి ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

నా వ్యాఖ్యలను వక్రీకరించారు: అమిత్ షా

సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతుండటంతో తన వ్యాఖ్యలపై అమిత్ షా స్పందించారు. తాను అంబేద్కర్‌కు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తన వ్యాఖ్యలను వక్రీకరించిందని దుయ్యబట్టారు. తాను మాట్లాడిన పూర్తి వీడియోను ప్రదర్శించాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఇదే అంశంపై ప్రధాని మోదీ కూడా స్పందించారు. అంబేద్కర్‌ను సంపూర్ణంగా గౌరవిస్తున్నదని తామేనని చెప్పుకొచ్చారు. అంబేద్కర్‌ను అవమానించిన తీరును కాంగ్రెస్ నేతలు ఇలాంటి అబద్ధాలతో ఎప్పటికీ దాచలేరంటూ మండిపడ్డారు.

పెనుగొండ లక్ష్మీనారాయణకు

సాహిత్య అకాడమీ అవార్డు

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: ప్రముఖ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణను సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. తెలుగులో రాసిన దీపిక అభ్యుదయ వ్యాస సంపుటికిగానూ ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు సాహిత్య అకాడమీ బుధవారం ప్రకటించింది. హిందీ కవయిత్రి గగన్ గిల్, ఆంగ్ల రచయిత్రి ఈస్టరిన్ కైర్‌లతోసహా 21 మందికి వార్షిక సాహిత్య అకాడమీ అవార్డులు లభించాయి. 21 భాషలలో వచ్చిన నవలలు, చిన్న కథలు, కవిత్వాలు, వ్యాసాలు, నాటకాలతోసహా వివిధ సాహితీ రూపాలను పరిశీలించిన జ్యూరీ సభ్యులు విజేతలను ఎంపిక చేశారు. సాహితీ విమర్శనాత్మక రచనలకుగాను పెనుగొండ లక్ష్మీనారాయణతోపాటు కన్నడ నుంచి కేవీ నారాయణ, మరాఠీ నుంచి సుధీర్ రసల్ అవార్డులకు ఎంపికయ్యారు. అవార్డు గ్రహీతలకు జ్ఞాపిక, శాలువాతోపాటు రూ.లక్ష నగదు బహుమతి ఉంటుంది.

జనవరి నుంచి ఉత్తరాఖండ్‌లో

యూసీసీ అమలు

డెహ్రాడూన్, డిసెంబర్ 18: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)ని 2025 జనవరి నుంచి ఉత్తరాఖండ్‌లో అమలు చేయనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ బుధవారం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత యూసీసీని అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ మారనున్నది. సచివాలయంలో బుధవారం ఉత్తరాఖండ్ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి బోర్డు(యూఐడీబీ) సమావేశంలో ముఖ్యమంత్రి ధామీ మాట్లాడుతూ గతంలో అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానానికి అనుగుణంగా యూసీసీ అమలు కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు.

కర్ణాటక ఆర్టీసీ 'శక్తి' విహీనం

- 'ఉచిత బస్సు' స్కీమ్ పైసలు కట్టని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆర్టీసీలకు 1,750 కోట్లకు పైగా బకాయిలు
- ఆర్థిక సంక్షోభంలోకి రోడ్డు రవాణా సంస్థలు
- 31 నుంచి సమ్మెకు దిగుతున్న కార్మికులు

బెంగళూరు, డిసెంబర్ 18: కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం రాష్ట్రంలోని నాలుగు ఆర్టీసీలను దివాలా తీయిస్తున్నది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు కల్పించిన ఆర్టీసీలకు చెల్లించాల్సిన డబ్బులను సిద్ధరామయ్య సర్కారు సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో ఆర్టీసీలు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తున్నాయి. బస్సుల నిర్వహణ, సిబ్బందికి వేతనాలు ఇవ్వడమూ ఆర్టీసీలకు కష్టంగా మారుతున్నది. ఆర్టీసీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఇచ్చిన ఐదు గ్యారెంటీల్లో శక్తి పథకం(మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) ప్రధానమైనది. 2023 జూన్ 11న ఈ పథకాన్ని ప్రారంభించింది.

పెండింగ్‌లో వందల కోట్ల బకాయిలు

మహిళల టికెట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీలకు చెల్లించాలి. కానీ, 2023-24కు సంబంధించి రూ.1,180.62 కోట్లు ఆర్థిక సంవత్సరంలో నవంబర్ నాటికి రూ.579.19 కోట్లు ప్రభుత్వం బకాయి పడింది. శక్తి పథకానికి ప్రభుత్వం బడ్జెట్‌లో చాలీచాలని నిధులు కేటాయిస్తున్నది. అవీ సక్రమంగా విడుదల చేయకపోవడంతో ఆర్టీసీలకు బకాయిలు పేరుకుపోతున్నాయి. దీంతో ఆర్టీసీలు దివాలా తీసే పరిస్థితులు ముంచుకొస్తున్నాయి. కాగా, కొత్త బస్సులకు ఇచ్చే పన్ను రాయితీలను శక్తి పథకం బకాయిల కింద ముడిపెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. రాయితీలకు, బకాయిలకు ముడిపెట్టొద్దని, బడ్జెట్ కేటాయింపులతో సంబంధం లేకుండా వ్యయానికి తగ్గట్టుగా నిధులు ఇవ్వాలని ఆర్టీసీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదు. కాగా, ఆర్టీసీలకు ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 31 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్టు ఆర్టీసీల కార్మికుల జేఏసీ ప్రకటించింది.



ముంబై సముద్రతీరంలో నీట మునిగిన పర్యాటక పడవ

ఫెర్రీ పైకి దూసుకెళ్లిన నేవీ పడవ

13 మంది మృతి.. 99 మందిని రక్షించిన నేవీ

ముంబై: ముంబై తీర సమీపంలో బుధవారం ఓ ఫెర్రీపైకి నేవీ పడవ దూసుకెళ్లిన ఘటనలో 13 మంది మరణించారు. 99 మందిని కాపాడినట్లు భారతీయ నేవీ తెలిపింది. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంజిన్ పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో నేవీకి చెందిన ఓ పడవ ముంబై తీర సమీపంలోని కరంజా వద్ద సముద్రంలో ప్రయాణికులతో వెళుతున్న నీల్ కమల్ అనే ఫెర్రీని ఢీకొంది. ఇందులో ప్రయాణిస్తున్న పర్యాటకులు గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి ప్రముఖ పర్యాటక ప్రదేశం ఎలిఫెంటా ద్వీపానికి వెళుతున్నారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు వెంటనే రంగంలో దిగారు. 99 మందిని కాపాడినట్టు నేవీ ఒక ప్రకటనలో తెలిపింది. మరణించిన 13 మందిలో ఒక నేవీ ఉద్యోగి, ఇద్దరు ప్రైవేట్ సిబ్బంది ఉన్నారు.

పంట వ్యర్థాల కాల్చివేత శిక్షార్హం

ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల ముసాయిదాలో పేర్కొన్న కేంద్రం

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీని కాలుష్యం వేధిస్తున్న తరుణంలో వ్యవసాయ పంటల వ్యర్థాలను బహిరంగంగా తగులబెట్టడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ నేరానికి పాల్పడేవారికి భారీ జరిమానాలను విధించేందుకు పారిశుద్ధ్య కార్మికులకు అధికారాలు ఇవ్వాలనుకుంటున్నది. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, 2024 ముసాయిదా ఈ ప్రతిపాదన చేసింది. దీనిని ఈ నెల 9న జారీ చేశారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల వ్యర్థాలను తగులబెట్టకుండా చర్యలు చేపట్టవలసిన బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించాలని ఈ ముసాయిదా చెబుతున్నది.

పంజాబ్‌లో రైతుల రైల్‌రోకో

పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం

చండీగఢ్, డిసెంబర్ 18: తమ డిమాండ్ల సాధనకు రైతులు చేపట్టిన రైల్ రోకో ఆందోళనతో బుధవారం పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు పలు డిమాండ్లు నెరవేర్చాలని సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా ఇచ్చిన పిలుపుమేరకు రైతులు పలుచోట్ల పట్టాలపై బైఠాయించి మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారని కిసాన్ మజ్దూర్ మోర్చా నేత శర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు. 30న పంజాబ్ బంద్ చేపట్టనున్నట్టు వెల్లడించారు.

గ్లోబల్ కింగ్‌మేకర్‌గా మస్క్?

ఇతర దేశాల రాజకీయాలపైనా దృష్టి

వాషింగ్టన్, డిసెంబర్ 18: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయడమే కాక, అతని తరపున స్వయంగా ప్రచారం చేసి గెలుపులో కీలక పాత్ర పోషించిన ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఇప్పుడు ఇతర దేశాల ఎన్నికల్లో సైతం తన ప్రభావాన్ని చూపాలనుకుంటున్నారు. ప్రపంచ రాజకీయాల్లో కింగ్ మేకర్‌గా మారాలనుకుంటున్నారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అందులో భాగంగా ఆయన తొలుత యూకేపై దృష్టి సారించారు. మంగళవారం యూకే సంస్కరణల నేత నిగెల్ ఫరాజ్‌ను కలిసారు. మస్క్ ఆయనను కేవలం ప్రచారం కోసం మాత్రమే కలవలేదని, ఫరాజ్‌కు రానున్న ఎన్నికల్లో ఆయన మిలియన్ డాలర్ల విరాళాన్ని ఇవ్వనున్నారని యూకే టెలిగ్రాఫ్ ఒక వార్తా కథనంలో పేర్కొంది. 'మస్క్ మా వెనుక ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. విరాళాలకు సంబంధించి ఆయనతో చర్చలు జరుగుతున్నాయి' అని ఫరాజ్ టెలిగ్రాఫ్‌కు తెలిపారు. 'గ్లోబల్ కింగ్ మేకర్' గా మారుదామనుకుంటున్నారని టెలిగ్రాఫ్ పేర్కొంది.

డోక్లాంలో చైనా గ్రామాలు

శాటిలైట్ చిత్రాల ద్వారా వెల్లడి

సిలిగురి కారిడార్‌కు పొంచి ఉన్న ముప్పు

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: గత కొన్ని దశాబ్దాలుగా భారత్, చైనా, భూటాన్ ట్రై జంక్షన్‌లో కొనసాగుతున్న సరిహద్దు వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. గత ఎనిమిదేండ్లుగా భూటాన్‌కు చెందిన ఈ భూభాగంలో చైనా 22 గ్రామాలు, స్థావరాలను నిర్మించినట్టు ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడైంది. అందులో 8 గ్రామాలు భూటాన్‌లో ఉన్న డోక్లాం పీఠభూమిలో ఉన్నాయి. ఇది చైనా మిలటరీ బేస్‌లకు సమీపంలో ఉండటమే కాక, వ్యూహాత్మక ప్రదేశం. దీని కారణంగా భారత్‌లోని సిలిగురి కారిడార్ (చికెన్ నెక్)కు ప్రమాదం పొంచి ఉంది. భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలను కలుపుతున్నది. ఇది స్వాధీనం చేసుకుంటే ఆ రాష్ట్రాలతో భారత్‌కు సంబంధాలను తెంపేయవచ్చు.

స్మార్ట్ మీటర్లపై బీజేపీ తొండాట

- ఏర్పాటు చేయాలని విపక్ష రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రం వెనుకడుగు
- గుజరాత్‌లో మంజూరైన వాటిలో 1 శాతమే ఏర్పాటు
- పలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రారంభమే కాని వైనం

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: పాత విద్యుత్తు మీటర్ల స్థానంలో కొత్త స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేసే విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నది. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయించాలని విపక్ష రాష్ట్రాలపై బీజేపీ నేతృత్వంలోని కేంద్రం ఒత్తిడి తెస్తున్నది. ఎఫ్ ఆర్‌బీఎం పరిమితులు సహా సవాలక్ష ఆంక్షలు విధిస్తున్నది. అయితే, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును పట్టించుకోవడం లేదు. గత మూడు దశాబ్దాలుగా బీజేపీ పాలనలో ఉన్న ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్ ఈ విషయంలో చాలా వెనుకబడి ఉంది. బీహార్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల కంటే వెనుకంజలో ఉంది. పలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనైతే ఇంత వరకు ఒక్క స్మార్ట్ మీటరు కూడా ఏర్పాటు చేయలేదు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుష్మిత దేవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రం రాజ్యసభలో ఇచ్చిన సమాధానంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

ప్రజా వ్యతిరేకతతో..

డిస్కమ్‌ల సరఫరా, నిర్వహణ సామర్థ్యం పెంచేందుకు కేంద్రం 2021 జూలైలో రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్(ఆర్డీఎస్ఎస్) పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా స్మార్ట్ మీటరింగ్ నేషనల్ ప్రాజెక్ట్ (ఎస్ఎంఎన్‌పీ) చేపట్టి స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నది. స్మార్ట్ మీటర్లతో కరెంటు బిల్లులు ఎక్కువ వస్తున్నాయని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజావ్యతిరేకతకు దారి తీస్తున్నది. గుజరాత్‌లోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు పలుమార్లు రోడ్డెక్కారు. దీంతో బీజేపీ వెనకడుగు వేసింది. గుజరాత్‌కు మొత్తం 1.64 కోట్ల స్మార్ట్ మీటర్లు మంజూరు కాగా కేవలం 2.19 లక్షల మీటర్లను మాత్రమే బిగించారు. పాత మీటర్ల స్థానంలో కాకుండా కొత్త విద్యుత్తు కనెక్షన్లకే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. రాజస్థాన్, గోవా, మణిపూర్ లాంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనైతే స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని అసలే ప్రారంభించలేదు. కాగా, స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో అస్సాం మొదటి స్థానం లో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఏపీ, యూపీ ఉన్నాయి. దేశవ్యాప్తంగా 19.79 కోట్ల స్మార్ట్ మీటర్లు మంజూరు కాగా నవంబర్ 29 నాటికి కేవలం 72.97 లక్షలు(3.7%) మాత్రమే ఏర్పాటయ్యాయి.

హెచ్-1బీ వీసాలు సులభతరం

- భారతీయులకు బైడెన్ శుభవార్త
- విద్యార్థి వీసాను హెచ్-1బీగా మార్చుకునేందుకు అవకాశం
- డీహెచ్ఎస్ నిబంధనల్లో మార్పులు
- జనవరి 17 నుంచి కొత్త నిబంధనలు

వాషింగ్టన్, డిసెంబర్ 18: అమెరికాలో ఉద్యోగాలు చేయాలని కలలు గంటున్న భారత యువతకు బైడెన్ సర్కారు తీపికబురు చెప్పింది. అమెరికాలోని కంపెనీలు సులభంగా విదేశీ నిపుణులను నియమించుకునేందుకు వీలుకల్పిస్తూ నిబంధనల్లో పలు మార్పులు చేసింది. దీనితోపాటు ఎఫ్-1 విద్యార్థి వీసాలను సులువుగా హెచ్-1బీ వీసాలుగా మార్చుకునే అవకాశం కల్పించింది. దీంతో లక్షల మంది భారత టెక్ ప్రొఫెషనల్స్‌కు లబ్ధి చేకూరనున్నది. వలసేతర (నాన్-ఇమ్మిగ్రెంట్) క్యాటగిరీలోకి వచ్చే హెచ్-1బీ వీసా సాయంతో అమెరికాలోని టెక్ కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను నియమించుకుంటాయి. ఈ వీసా ద్వారా భారత్, చైనా భారీగా లబ్ధి పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలోని కంపెనీలు సులభంగా విదేశీ వృత్తి నిపుణులను నియమించుకునేందుకు వీలుకల్పిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) మంగళవారం కొత్త నిబంధనలను ప్రకటించింది. తద్వారా హెచ్-1బీ వీసాల వార్షిక చట్టబద్ధ పరిమితి నుంచి మినహాయింపు పొందిన నాన్‌ప్రాఫిట్, ప్రభుత్వేతర పరిశోధన సంస్థల నిర్వచనాలు, నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతో అమెరికన్ సంస్థలు తమ వ్యాపార అవసరాలకు తగ్గట్టుగా విదేశీ వృత్తి నిపుణులను నియమించుకుని ప్రపంచ మార్కెట్‌లో నిలదొక్కుకునేందుకు వీలవుతుంది. కొత్త విధానంలో లేబర్ కండీషన్ అప్లికేషన్ కచ్చితంగా హెచ్-1బీ వీసా పిటిషన్‌కు అనుగుణంగా ఉండాలి. ఈ నిబంధనలు వచ్చే ఏడాది జనవరి 17 నుంచి అమల్లోకి రానున్నాయి.

కెనడాలో శాశ్వత నివాస నిబంధనలు కఠినతరం

ఒట్టావా, డిసెంబర్ 18: శాశ్వత నివాసానికి సంబంధించిన నిబంధనల్ని మరింత కఠినతరం చేయనున్నట్టు కెనడా ప్రకటించింది. 'ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ' విధానంలో జరుగుతున్న మోసాల్ని అరికట్టేందుకు.. వలస విధానంలో సమగ్రతను మరింత బలోపేతం చేయనున్నట్టు తెలిపింది. జాబ్ ఆఫర్‌తో శాశ్వత, తాత్కాలిక నివాసాన్ని కోరుకుంటున్న దరఖాస్తుదారులకు సంబంధించి 'అదనపు పాయింట్స్'ను తొలగించబోతున్నది. దీంతో కెనడాకు వెళ్లే లక్షలాది మంది భారతీయ విద్యార్థులు, ఆ దేశంలో తాత్కాలిక నివాస హోదా కలిగిన కార్మికులపై తీవ్ర ప్రభావం పడనున్నది. కెనడా మంత్రి మార్క్ మిల్లర్ విలేకర్ల సమావేశంలో నిబంధనల్లో మార్పులపై కీలక ప్రకటన చేశారు.



ట్రంప్ కొత్త లుక్

న్యూయార్క్, డిసెంబర్ 18: అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న డొనాల్డ్ ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. మంగళవారం ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో ఉన్న తన ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ క్లబ్‌కు ఆయన వచ్చారు. తన సాధారణ హెయిల్‌స్టైల్‌కు భిన్నమైన కొత్త హెయిర్‌స్టైల్‌తో ట్రంప్ కనిపించారు.

'జమిలి' జేపీసీలో ప్రియాంక

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: జమిలి ఎన్నికల బిల్లులను అధ్యయనం చేయనున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) సభ్యులపై స్పష్టత వచ్చింది. 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో కమిటీ ఏర్పాటుకానుంది. జేపీసీలో లోక్‌సభ నుంచి బీజేపీ తరపున పీపీ చౌదరి, బన్సూరి స్వరాజ్, అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ నుంచి ప్రియాంకా గాంధీ, మనీశ్ తివారి, తృణమూల్ కాంగ్రెస్ నుంచి కల్యాణ్ బెనర్జీ, ఎన్సీపీ(ఎస్పీ) నుంచి సుప్రియా సూలె పేర్లను ప్రతిపాదించారు.

మధుమేహం పనిపట్టే కొత్త ఔషధం

- హెచ్‌పీహెచ్-15తో షుగర్ కంట్రోల్
- కొవ్వును తగ్గించేందుకూ ఉపయోగం
- అభివృద్ధి చేసిన జపాన్ శాస్త్రవేత్తలు

టోక్యో, డిసెంబర్ 18: మధుమేహాన్ని నియంత్రించే కొత్త ఔషధాన్ని జపాన్‌లోని కుమమొటొ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. హెచ్‌పీహెచ్-15 అనే ఈ ఔషధం ఒంట్లో చక్కెర స్థాయిలను అదుపు చేయడంతో పాటు పేరుకుపోయిన కొవ్వును తగ్గించడానికి సైతం సమర్థంగా పని చేస్తున్నదని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న మెట్ఫార్మిన్ కంటే ఇది మెరుగ్గా పని చేస్తున్నట్టు చెప్పారు. ప్రొఫెసర్ ఐచి అరకి, అసోసియేట్ ప్రొఫెసర్ హిరోషి తతీషి నేతృత్వంలోని పరిశోధకుల బృందం హెచ్‌పీహెచ్-15ను అభివృద్ధి చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు 'డయాబెటొలోజియా' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. కాలేయం, కండరాలు, కొవ్వు కణాలు గ్లూకోజ్‌ను శోషించుకోవడాన్ని మెరుగుపర్చడం ద్వారా ఇది షుగర్ లెవల్స్‌ను అదుపు చేస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. తక్కువ డోసుతోనే ఇది మెట్ఫార్మిన్ కంటే మెరుగ్గా పని చేస్తున్నట్టు తేల్చారు.

కొవ్వును కరిగించడానికీ ఉపయోగం

చర్మం కింద పేరుకుపోయిన కొవ్వును తగ్గించడంలోనూ, ఫ్యాటీ లివర్‌ను నయం చేయడంలోనూ హెచ్‌పీహెచ్-15 సమర్థంగా పని చేస్తున్నట్టు వెల్లడించారు. ఇందులో యాంటీఫైబ్రాటిక్ గుణాలు కూడా ఉన్నాయని, మధుమేహ బాధితుల్లో సాధారణంగా కనిపించే లివర్ ఫైబ్రోసిస్‌ను తగ్గించడానికీ ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. మెట్ఫార్మిన్ తీసుకునే వారిలో లాక్టిక్ యాసిడ్ ఉత్పత్తి ఎక్కువవడం సమస్యగా ఉంటుందని, హెచ్‌పీహెచ్-15తో ఈ సమస్య చాలా తక్కువ అని తెలిపారు. మధుమేహంతో పాటు ఊబకాయం ఉన్న వారి చికిత్సకు ఈ ఔషధం మెరుగ్గా పని చేస్తుందని చెప్పారు.

క్యాన్సర్‌కు వ్యాక్సిన్

ఎంఆర్ఎన్ఏ టీకా అభివృద్ధి చేసిన రష్యా.. వచ్చే ఏడాది నుంచి ఉచితంగా ప్రజలకు!

మాస్కో, డిసెంబర్ 18: ప్రాణాంతక క్యాన్సర్